క్లుప్తంగా

సీఎస్సార్ నిధులు గడువులోగా వినియోగించుకోవాలి


నిబంధనల ప్రతిని అందిస్తున్న జీఎం

రామగిరి: సీఎస్సార్ నిధులను నిర్ణీత గడువు లోగా వినియోగించుకోవాలని సింగరేణి సంస్థ ఆర్జీ - 3 ఎస్వోటూ జీఎం జి.రఘుపతి సూచించారు. సోమవారం జెడ్పీ చైర్మన్ పుట్టమధును కలిసి మాట్లాడారు. కొత్త చట్టం ప్రకారం మంజూరైన నిధులను 3 ఏళ్ల లోపు వినియోగించుకోవాలని లేనిపక్షంలో సీఎస్సార్ నిధులు కేంద్ర ప్రభుత్వానికి బదిలీ అవుతాయని ఆయన తెలిపారు. 2019–20 సంవత్సరంలో మంజూరైన సీఎస్సార్ నిధులు ఈనెల 31లోపు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జయశంకర్ భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు వర్షిణి, పర్సనల్ అధికారులు మిట్ట రవీంధర్‌రెడ్డి, కావూరి మారుతి తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్- నీరుకుల్ల డబుల్ రోడ్డు పనులు ప్రారంభం


ప్రారంభమైన రోడ్డు వెడల్పు పనులు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ పట్టణం నుంచి నీరుకుల్ల వరకు డబుల్ పనులు ప్రారంభమైనాయి. ఏడు కిలోమీటర్ల మేరకు రెండు దశల్లో రూ.6.54 కోట్ల నిధులు మంజూరయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.2.54 కోట్లు, డీఎంఎఫ్‌టీ నిధులు రూ. 6 కోట్ల నిధులతో పనులు చేపట్టుతున్నట్లు ఆర్అండ్‌బీ ఈఈ తెలిపారు. డబుల్ రోడ్డుకు నిధులు కేటాయించడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

సుల్తానాబాద్: మండల కేంద్రంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు.సామవారం మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమంగా తరలిస్తే జరిమానా విధించడంతోపాటు, భవిష్యత్తులో వాహనాలను సీజ్ చేస్తామని తహసీల్దార్ యాకన్న తెలిపారు.

ముస్త్యాల సర్పంచ్‌కు అవార్డు


అవార్డు అందుకుంటున్న సర్పంచ్ లావణ్య

యైటింక్లయిన్‌కాలనీ: వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన పదో వార్షికోత్సవం సందర్భంగా రామగిరి మండలం ముస్త్యాల సర్పంచ్ లావణ్య కు ఫౌండేషన్ నిర్వాహకులు ప్రతిభా పురస్కారం అందజేశారు. లావణ్య గ్రామ ప్రజలకు చేస్తున్న సామాజిక సేవలకు గాను ఈ అవార్డును అందించినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు అంకయ్య తెలిపారు. కార్యక్రమంలో ఫిల్మ్ యాంకర్స్ గౌతం రాజు, సుదర్శన్, ఏలూరి శ్రీనివాస్, ఎంవీఎల్ నాగేశ్వరరావు, సూపరిండెంట్ ఆఫ్ సీఎస్సీ కోర్టు తెలంగాణ అంజనీ కుమార్, కుసుమ కుమారి, బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ, శ్రీ సాయి చరణ్, కళాక్షేత్ర మధుమతి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సమన్వయ కమిటీ మెంబర్‌గా కుమార్

యైటింక్లయిన్‌కాలనీ: బీఆర్ఎస్ పార్టీ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ సమన్వయ కమిటీ మెంబర్‌గా తమ్మనవేణి కుమార్ యాదవ్‌ను నియమించినట్లు రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యేకు, యైటింక్లయిన్ కాలనీ బీఆర్ఎస్ అధ్యక్షుడు మేడి సదానందం కృతజ్ఞతలు తెలిపారు.

అంబేద్కర్ యూత్ అధ్యక్షుడిగా నాగరాజు

రామగిరి: ముత్తారం మండలం ఓడేడ్ అంబేడ్కర్ యూత్ అధ్యక్షుడిగా రత్న నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. సోమవారం స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో నూతన కమిటీని ఎన్నికున్నారు. ఉపాధ్యక్షుడిగా రత్న రాకేశ్, కోశాధికారిగా చందుతో పాటు ఆరుగురిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికున్నట్లు సంఘం గౌరవ అధ్యక్షుడు రత్న రమేశ్ తెలిపారు.

రోడ్డుపైనే వారసంతలు


సుల్తానాబాద్‌లో రోడ్డుపైనే నిర్వహిస్తున్న వారసంత

సుల్తానాబాద్: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో వారసంత వల్ల వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డుపైకి వచ్చి కూరగాయల వ్యాపారులు, ఇతర వ్యాపారాలు చేసే వారు వ్యాపారం చేస్తుండడంతో ఇరువైపులకు వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడుతున్నామని వాహనదారులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్, పోలీస్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని రోడ్డు పై వ్యాపారం చేయకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు


కమాన్‌పూర్ మండల కేంద్రంలో రోడ్డు పైనే నిలిపిన వాహనాలు

కమాన్‌పూర్: మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం జరిగే వారసంతతో ప్రధాన రహదారి పై వెళ్లే వాహనదారులు, సంతకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వార సంతలో వ్యాపారం చేసుకునేందుకు వచ్చే వారు వారి వాహనాలను రోడ్డు పక్కనే నిలిపి వ్యాపారం చేస్తుండడంతో వాహనదారులు ఎక్కడ ప్రమాదం జరుగుతుందోని ఆందోళన చెందుతున్నారు. గతంలో వాహనదారులకు పోలీసులు, పంచాయతీ వారు ఫైన్‌లు విధించినా.. పట్టించుకోవడం లేదు. వాహనాలను రోడ్డు పక్కన నిలుపుతుండంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

పట్టుదలే విజయానికి నాంది


పోలీస్ టీంకు ట్రోఫీ అందిస్తున్న ఎమ్మెల్యే, డీసీపీ

గోదావరిఖని: పట్టుదలతో ముందుకు సాగితే విజయం సాధ్యమవుతుందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్ అన్నారు. కోరుకంటి ప్రీమియర్ లీగ్ సీజన్ –3 కేటీఆర్ గోల్డ్ కప్ సోమవారంతో ముగిసింది. ఫైనల్ మ్యాచ్ కుక్కలగూడూరు, పోలీస్ టీంల మధ్య జరిగింది. హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో పోలీస్ జట్టు విజేతగా నిలవగా, కుక్కలగూడూరు జట్టు రెండో స్థానంలో నిలిచింది. పోలీస్‌జట్టుకు రూ.లక్ష నగదు బహుమతి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేదాకా ప్రతివ్యక్తి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు సమాజంలో ఉన్నతంగా నిలిచి, ఇతరులకు మార్గదర్శకంగా నిలవాలన్నారు. ఉద్యమాలకు పురిటి గడ్డగానే కాకుండా రాబోయే కాలంలో క్రీడాకారులకు కూడా నెలవుగా ఈప్రాంతం మారుతుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏసీపీ గిరిప్రసాద్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్లు దొంత శ్రీనివాస్, కొమ్ము వేణుగోపాల్, కుక్కల గూడూరు సర్పంచ్ చందర్, నాయకులు జేవీ రాజు, టోర్నమెంట్ నిర్వాహకులు కెనడి, సంతోష్, శ్రీనివాస్, సత్యం , జక్కుల తిరుపతి, జితేందర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

- పెదపల్లి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

సుల్తానాబాద్‌రూరల్: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా పని చేస్తోందని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండలం నారాయణపూర్, కొదురుపాక గ్రామాల్లో సోమవారం ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీరోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో అన్ని రకాల వసతులను కల్పించేందుకు సీఎం కేసీఆర్ ఎంతో చిత్తశుద్ధితో ఉన్నారన్నారు. అందుకే ప్రతి గ్రామంలో సీసీరోడ్లు, డ్రెయినేజీలు, ప్రకృతి వనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

కార్యక్రమాల్లో ఎంపీపీ బాలాజీరావు, సర్పంచ్‌లు మూల స్వరూప, సాగర్‌రావు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి

సుల్తానాబాద్‌రూరల్: కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శశికళ అన్నారు. సుల్తానాబాద్ మండలం గొల్లపల్లిలో సోమవారం కంటివెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ బండారి రమేశ్‌తో కలిసి ఎంపీడీవో ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీవో ఫయాజ్ అలీ, కార్యదర్శి ప్రమోద్, వైద్యసిబ్బంది తదితరులున్నారు.

ఓదెల: ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జి సత్తయ్య అన్నారు. మండలంలోని ఉప్పరపల్లెలో సోమవారం కంటివెలుగు శిబిరంను ప్రారంభించారు. విద్యార్థులు, వృద్ధులు, మహిళలు కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లె ఓదెలు, ఎంపీటీసీ గోపు లావణ్య, డాక్టర్ సంజనేశ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న కంటివెలుగు కార్యక్రమాన్ని అందరూ వినియోగించుకోవాలని పెద్దపల్లి మండలం దేవునిపల్లి సర్పంచ్ రాయిశెట్టి కిషన్ అన్నారు. సోమవారం గ్రామంలో


కంటివెలుగును పరిశీలిస్తున్న ఎంపీడీవో

కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పందిళ్ల లక్ష్మణ్, వైద్యాధికారులు, సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

లాలపల్లిలో 127మందికి కంటి పరీక్షలు

ఎలిగేడు: మండలంలోని లాలపల్లిలో జరుగుతున్న కంటివెలుగులో భాగంగా సోమవారం 127మందికి కంటి పరీక్షలు నిర్వమించి 14 మందికి కంటి అద్దాలను అందజేసినట్లు మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సింగిరెడ్డి ఎల్లవ్వ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి ఎమ్మెల్యే మందలింపు

రామగిరి: మండలంలోని పన్నూరు పంచాయతీ కార్యదర్శి పూరెళ్ల ఆకాశ్‌ను సోమవారం ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మందలించారు. గ్రామంలోని మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయనకు సిద్దం రాజేశ్వరి అనే మహిళ తాను కాంగ్రెస్ పార్టీ మనిషినని పంచాయతీ కార్యదర్శి తన పింఛన్ తీసేశాడని ఫిర్యాదు చేయడంతో ఆకాశ్‌ను పిలిపించిన శ్రీధర్‌బాబు ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ పార్టీలకు అతీతంగా ప్రజలకు పని చేయాలని సూచించాడు. ఇలా పార్టీల కోసం పనిచేస్తే ఉద్యోగం ఊడుతుందని, జాగ్రత్తగా విధులు నిర్వహించాలని మందలించాడు. రాజేశ్వరికి పింఛన్ మంజూరు చేయించాలని ఆదేశించారు.

మొక్కులు తీర్చుకున్న ఎమ్మెల్యే

మండలంలోని పన్నూరు శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం ఏఐసీసీ కార్యదర్శి, ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మొక్కులు తీర్చుకున్నారు. గత శాసన సభ ఎన్నికల్లో శ్రీధర్‌బాబు ఎమ్మెల్యేగా గెలిస్తే 101 కొబ్బరికాయలు కొడతానని గ్రామానికి చెందిన కొండపర్తి హరికృష్ణ మొక్కుకోవడంతో సోమవారం శ్రీధర్‌బాబు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నాడు. కార్యక్రమంలో


కార్యదర్శిని మందలిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

సర్పంచ్ అల్లం పద్మ, ఎంపీటీసీలు మహేష్, కొప్పుల గణపతి, సందీప్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు నాయకులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

మండలంలోని పన్నూరులో సోమవారం అనారోగ్యంతో మృతి చెందిన గంధం చంద్రయ్య మృతదేహాన్ని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సందర్శించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీటీసీ చిందం మహేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, నాయకులు ఉన్నారు.

ఆలయానికి రూ. లక్ష విరాళం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని శ్రీపాతాళేశ్వర, చెన్నకేశవ ఆలయానికి గ్రామానికి చెందిన రాపోలు వంశానికి చెందిన బంధువు రిటైర్డ్ రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ పుప్పాల విక్రమసింహారావు రూ.లక్ష విరాళం అందజేశారు. ముర్మూర్ గ్రామ సమీపంలోని గోదావరినది ఉత్తర ప్రవాహం ఉండడంతో ప్రతీ ఏటా ఎన్టీపీసీ నుంచి తమ కుటుంబసభ్యులు పుణ్యస్నానాలకు వచ్చి ప్రాజెక్టు నిర్మాణానికి ముందు గ్రామంలోని శ్రీపాతాళేశ్వర, చెన్నకేశవ ఆలయాలను దర్శించుకునే వారు. ఈ నేపథ్యంలో దేవతలపై ఉన్న భక్తితో విరాళం అందజేశానని తెలిపారు. అనంతరం దాత విక్రమసింహారావును సర్పంచ్ బాదరవేణి స్వామి, గోపు కొమురయ్య, ఎలుక కొమురయ్య తదితరులు సన్మానించారు.

శ్రీప్రసన్న సీతారామాంజనేయ ఆలయ నిర్మాణానికి విరాళం

రామగిరి: ముత్తారం మండలం ఖమ్మంపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ ప్రసన్న సీతారామాంజనేయ ఆలయ నిర్మాణానికి హైదరాబాద్‌లోని బలక్ంపేట(ఎస్సార్ నగర్)కు చెందిన కొత్తపల్లి మధూకర్ గౌడ్ రూ1,11,116లు విరాళం అందజేశారు. సోమవారం ఆలయ కమిటీ సభ్యులు అందించారు. ఈ సందర్భంగా మధూకర్ గౌడ్ కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఎంపీటీసీ అల్లం తిరుపతి, మాజీ సర్పంచ్ జక్కుల సదయ్య, మాజీ ఎంపీటీసీ బండారి సుధాకర్, తీర్థాల స్వామి, మల్లయ్య పాల్గొన్నారు.

నిరుద్యోగులకు పుస్తకాలు పంపిణీ

జూలపల్లి: నిరుద్యోగులు ఉపాధి అవకాశాలు అందించే కోర్సులను, పుస్తకాలను చదువుకోవాలని జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ సూచించారు. మండలంలోని వడ్కాపూర్‌లో గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న నిరుద్యోగులకు రూ.5 వేల విలువ గల పుస్తకాలను కేసీఆర్ సేవాదళం యూత్ మండల అధ్యక్షుడు జెట్టి సతీశ్ అందించారు. గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మాంకాళి తిరుపతి,కార్యదర్శి మౌనిక, పెద్దపల్లి కేసీఆర్ సేవాదళం జిల్లా అధ్యక్షుడు దండె వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ ఎర్రోల్ల రాములు, స్వామి, ఐలయ్య, అంతయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తారకరత్నకు నివాళి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీ పూర్వ విద్యార్థి నందమూరి తారకరత్న మరణంపై కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు నివాళి అర్పించారు. సోమవారం కాలేజీ ఆవరణలో సంతాప కార్యక్రమం నిర్వహించారు. 2001లో బీటెక్ (ఈసీఈ) లో చేరిన తారకరత్న మరుసటి ఏడాది సినీరంగ ప్రవేశం చేసి ఒకేసారి 9 చిత్రాలను ఒకే సారి ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. కళాశాల చైర్మన్ ఎడవల్లి నవీన్,డైరెక్టర్ నవత, లక్ష్మీనారాయణ సంతాపం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, నరేశ్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ ప్లేయర్‌కు సన్మానం


సన్మానిస్తున్న మిత్రులు, గ్రామస్తులు

రామగుండం: ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన అండర్-50 ఐదో ఆలిండియా మాస్టర్ గేమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీల్లో టీటీఎస్ అంతర్గాం గ్రామానికి చెందిన అంగడాల వెంకటేశ్ అనే ఫుట్‌బాల్ క్రీడాకారుడు ఉత్తమ క్రీడాకారుడిగా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా సోమవారం క్రీడాకారుడిని ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధి ఇండిబిల్లి రవీందర్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోల సంతోష్‌కుమార్‌గౌడ్, బర్మా, కాందీశీకుల సంఘం ప్రతినిధి జెమ్ముల రామారావు, శోభన్‌బాబు తదితరులున్నారు.

ఆర్మీకి ఎంపికైన యువకుడికి సన్మానం

కమాన్‌పూర్:మండలంలోని పెంచికల్‌పేటకు చెందిన ఇరుగురాళ్ల రోహిత్ ఆర్మీకి ఎంపిక కావడంతో సోమవారం యువకులు ఘనంగా సన్మానించారు. రోహిత్‌ను యువత ఆదర్శంగా తీసుకుని ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని వారు సూచించారు. దేశ రక్షణ కోసం రోహిత్ ఆర్మీ ఉద్యోగం సంపాదించడం చాలా అదృష్టమని దేశానికి మరిన్ని సేవలు చేయాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఇరుగురాల రమేశ్, శేఖర్, రాజు, అనవేన వేణు, పెద్దపల్లి రాకేశ్, జనగామ శేఖర్, వంగల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ యువసేన మండల అధ్యక్షుడిగా సంతోష్

సుల్తానాబాద్: ఛత్రపతి శివాజీ యువసేన మండల అధ్యక్షుడిగా మండలంలోని గట్టేపల్లి గ్రామానికి చెందిన కొల్లూరి సంతోష్ కుమార్‌ను నియమిస్తూ బీజేపీ మండల అధ్యక్షుడు కడారి అశోక్ రావు ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం నియామకపత్రంను అందించారు. అనంతరం మాట్లాడుతూ యువతను పార్టీలోకి తీసుకురావడానికి శివాజీ సిద్ధాంతాలను చేరవేయాల్సిన అవసరం ఉందన్నారు. తన నియామకానికి సహకరించిన అశోక్ రావు, సోదరి మహేందర్ యాదవ్, గడ్డం మహిపాల్ రెడ్డి, కొమ్ము తిరుపతి యాదవ్, ఏల్లెంకి రాజన్న, కోట నాగన్న, చిట్టావేని సదయ్య, కూకట్ల నాగరాజు, పట్టణ అధ్యక్షుడు ఎనగందుల సతీశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ధర్మారం అలయన్స్ క్లబ్‌కు సూపర్ బెస్ట్ క్లబ్ అవార్డు

ధర్మారం: తక్కువ సమయంలోనే సేవా కార్యక్రమంలో ముందున్న ధర్మారం అలయన్స్ క్లబ్‌కు సూపర్ బెస్ట్ క్లబ్ అవార్డు లభించింది. మంచిర్యాలలో జరిగిన అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 258 వార్షికోత్సవం సందర్భంగా ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ అల్లై సీవీఎం రావు, వైస్ ప్రెసిడెంట్ మతివనన్ చేతుల మీదుగా ఈ సూపర్ బెస్టు క్లబ్ అవార్డులను క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సురేందర్, శ్రీనివాస్ అందుకున్నారు. అధ్యక్ష కార్యదర్శితో పాటు కోశాధికారి గడ్డం శ్రీనివాస్, పీఆర్‌వో అమరొపెల్లి నారాయణను సన్మానించి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందించారు.

శివాలయంలో అన్నపూజ

సుల్తానాబాద్: పట్టణంలోని శివాలయంలో మాఘ మాసం చివరి సోమవారం సోమతి అమావాస్య పురస్కరించుకుని స్వామివారికి రుద్రాభిషేకం, అన్నపూజ నిర్వహించారు. హాజరైన భక్తులకు పూజారి రమేశ్ తీర్థ ప్రసాదాలు భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అల్లంకి సత్యనారాయణ, వ్యాపారులు జనార్దన్ వసంత, పల్లా సురేశ్ అపర్ణ దంపతులు, కొమురవెల్లి వీరభద్రయ్య తో సహా పలువురు పాల్గొన్నారు.

కార్పొరేట్ జ్యువెలరీ వ్యవస్థను రద్దు చేయాలి

పెద్దపల్లిరూరల్: రాష్ట్రంలో స్వర్ణకార వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారి కోసం ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.2వేల కోట్లు కేటాయించాలని స్వర్ణకార సంఘ రాష్ట్రనాయకుడు కృష్ణమాచారి కోరారు. సోమవారం పెద్దపల్లిలో జరిగిన సంఘం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్పొరేట్ జ్యువెలరీ వ్యవస్థ మార్కెట్‌లోకి రావడంతో స్వర్ణకారుల బతుకులు దుర్భరమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో విశ్వబ్రాహ్మణుల పాత్ర కీలకమని, ప్రొఫెసర్ జయశంకర్, శ్రీకాంతాచారిల జయంతి, వర్ధంతిలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలన్నారు. అనంతరం కృష్ణమాచారిని స్థానిక సంఘ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు కట్ట సదానందం , రాజానందం, శ్రీనివాస్, దేవరకొండ రాజు, వెంకటేశ్వర్లు, పూర్ణచారి, మునిగంటి కృష్ణ, రాంనర్సయ్య, వేణుగోపాల్ తదితరులున్నారు.

రైతులకు పరిహారం ఇవ్వాలి


కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న లక్ష్మణ్‌కుమార్

ధర్మారం: మండలంలోని మేడారం గ్రామశివారు నుంచి డీ – 83బీ కాల్వ వరకు చేపట్టిన కాల్వ నిర్మాణం కోసం చేస్తున్న బ్లాస్టింగ్‌తో పంట పొలాలకు నష్టం జరుగుతుందని సదరు రైతులకు పరిహారం ఇప్పించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు సోమవారం జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. మేడారం రిజర్వాయర్ నుంచి డీ– 83 బీ కాల్వ వరకు చేస్తున్న పనుల కోసం మోతాదుకు మించి బ్లాస్టింగ్ చేస్తున్నారని ఆరోపించారు. దీంతో వరిపొలాలు, మామిడి తోటలలో బండరాళ్లు పడి నష్టం జరుగుతుందన్నారు. వెంటనే సదరు కాంట్రాక్టర్ నుంచి పరిహారం ఇప్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోమటిరెడ్డి రవీందర్‌రెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు మహిపాల్, మోటపలుకుల అశోక్, పిడుగు లచ్చయ్య, అరిగే లింగయ్య, సామంతుల మల్లయ్య, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మడిపెల్లి హుస్సేనిమియా వాగుపై వంతెన మంజూరు చేయాలని సర్పంచ్ రాణి, పాలకవర్గం, గ్రామస్తులు సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. తమ వ్యవసాయ భూములు వాగు అవతల ఉన్నాయని చెక్ డ్యాంల నిర్మాణంతో వాగులో నీరు నిల్వ ఉండి దాటలేక పోతున్నామని, తమ బంధువులు ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు చేయాలంటే వాగు దాటడం ఇబ్బందిగా ఉందని తెలిపారు. పెద్దపల్లి జిల్లా కేంద్రానికి వెళ్లాలన్నా, ఓదెలకు వెళ్లాలంటే చుట్టూ తిరిగి మరో 10 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాలసి వస్తోందని వారు వాపోయారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు చొప్పదండి సునీత, సదయ్య, కోఆప్షన్ సభ్యులు ఎండీ సుల్తాన్, పిట్టల భూమయ్య, ఫరీద్, మోహన్ గ్రామస్తులు ఉన్నారు.

మోడల్‌స్కూల్ సందర్శన


సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు, నాయకులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మల్యాల మోడల్ స్కూల్‌ను ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి, ఎంపీడీవో రామ్మోహనాచారి, ఎంపీవో గోవర్ధన్, స్పెషలాఫీసర్ శ్రీదేవి సోమవారం సందర్శించారు. స్కూల్, హాస్టల్‌లో విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కామర్స్ లెక్చరర్ గత కొంత కాలంగా అనారోగ్యంతో సెలవు పెట్టడంతో సిలబస్ పూర్తి కాలేదని, పరీక్షలు దగ్గరపడుతున్నాయని తామెలా పరీక్షలు రాయాలని విద్యార్థులు వాపోయారు. ప్రత్యామ్నాయంగా మరో లెక్చరర్‌ను నియమించాలని ఎంపీపీ ప్రిన్సిపాల్ సుజాతకు సూచించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల దృష్ట్యా బాలికలు హాస్టల్‌లో ఉండి చదువుకోవాలని ఎంపీపీ సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనం మెనూ ప్రకారం అందించాలని ఎంపీపీ వార్డెన్లను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సజాత, జీపీ కార్యదర్శి నాగరాజు,అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పశుమిత్రలకు వేతనాలు చెల్లించాలి

ఓదెల: పశుమిత్రలకు ప్రభుత్వం వేతనాలు చెల్లించాలని సోమవారం తహసీల్దార్ రమేశ్‌కు వినతిపత్రం అందించారు. కేంద్రప్రభుత్వం పశుమిత్రలను నియమించి ఏనిమిదేళ్లు గడిచినా ఇప్పటి వరకు వేతనాలు ఇవ్వలేదన్నారు. రైతులకు పశుపోషణపై అవగాహన కల్పిస్తూ , పశుబీమా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే జీతాలను చెల్లించాలని వారు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పశుమిత్రలు చంద్రకళ, నర్మద, స్వప్న, సుధ, సంధ్య, పద్మ పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

రామగిరి: ముత్తారం మండలంలోని మచ్చుపేటలో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకుడు చిలివెరి లక్ష్మణ్ కోరారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతి పత్రం అందించి మాట్లాడారు. గ్రామంలో దోమల బెడద ఎక్కువ ఉన్నందున ప్రజల ఆరోగ్య దృష్ట్యా దోమల మందు స్ప్రే, ఫాగింగ్ చేయించాలని కోరారు.

డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు 3466 దరఖాస్తులు

ఓదెల:మండలంలో డబల్‌బెడ్‌రూం ఇళ్ల మంజూరు కోసం 3,466 దరఖాస్తులను వచ్చినట్లు మండల తహసీల్దార్ కె రమేశ్ సోమవారం తెలిపారు. మండలంలోని 22 గ్రామాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల మంజూరు కోసం గ్రామపంచాయతీల్లో దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తులపై ఆర్ఐలు బండ రాజేందర్, నర్సింగ్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టి, అర్హులైన నిరుపేదలకు అందిస్తామని పేర్కొన్నారు.

చెక్కు అందజేత

జూలపల్లి: మండలంలోని కుమ్మరికుంట గ్రామానికి చెందిన రైతు సాయిని రామారావు గతంలో అనారోగ్యంతో మరణించగా, ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకం నుంచి రూ. 2 లక్షలు మంజూరు కాగా, మృతుడి భార్య సాయిని సౌజన్యకు చొప్పదండి కేడీసీసీ బ్యాంకు మేనేజరు శ్రీలత అందజేశారు. కార్యక్రమంలో డీఈ చంద్రారెడ్డి, జూలపల్లి,దూళికట్ట సింగిల్‌విండో చైర్మన్లు వెంకటయ్య, వేణుగోపాలరావు, సర్పంచ్ సంతోశ్ రావు, ఎంపీటీసీ తమ్మడవేని మల్లేశం, వైస్ చైర్మన్ తోట ముత్తులింగం, డైరెక్టర్లు పాల్గొన్నారు.

సమాచారం

నేడు లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూ

రామగిరి: మైనార్టీ కార్పొరేషన్ నుంచి 2022–23 సంవత్సరానికి మంజూరైన రుణాల లబ్ధిదారుల ఎంపిక కోసం నేడు సెంటినరీకాలనీలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమేశ్ తెలిపారు.

రేపటి నుంచి కేసీఆర్‌కప్ సెమీ ఫైనల్స్

పెద్దపల్లిరూరల్:కేసీఆర్ కప్ క్రికెట్ పోటీలు సెమీఫైనల్స్‌కు చేరాయి. ఈనెల 22 నుంచి ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో జరిగే క్రికెట్ జట్ల పోటీలకు సోమవారం డ్రా తీసినట్లు ఆర్గనైజర్ ఉప్పు రాజ్ కుమార్, మోబిన్ తెలిపారు. నియోజకవర్గ స్థాయి విజేతకు ప్రైజ్‌మనీగా రూ.50 వేలు, రన్నర్ జట్టుకు రూ. 25వేలను ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అందిస్తారని పేర్కొన్నారు.